

కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యానికి సంబంధించి అర్హులైన ప్రతీ ఒక్కరికీ రెండు నెలల్లోపు ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్‌లో సదరం/యుడీఐడీ శిబిరాల నిర్వహణపై డీఆర్డీవో, వైద్యశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వైకల్యంతో కూడిన ప్రతి ఒక్కరికి సదరం, యూడీఐడీ శిబిరాల ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వెయిటింగ్ జాబితాలో వివిధ వైకల్యాలతో బాధపడుతున్న 689 మంది అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు వీలుగా పెద్ద సంఖ్యలో శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, కొడంగల్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ పద్మ పాల్గొన్నారు.

రెండో రోజు@ రూ.163.6 కోట్లు

» మూడెకరాలలోపు రైతులకు అందిన రైతు భరోసా

వికారాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతు భరోసా నిధులు విడుదల చేసిన రెండో రోజు జిల్లాలో మూడు ఎకరాల లోపు రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేశారు. మంగళవారం వరకు 2,05,361 మంది రైతుల ఖాతాల్లో రూ.163.55 కోట్లు జమ చేశారు. మరో వారం రోజుల్లో పోర్టల్‌లో నమోదైన రైతులందరి ఖాతాల్లో భరోసా డబ్బులు జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఇదిలా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఉపయుక్తంగా నిలువనుందని ఆయన అన్నారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.





పరికరాల ఏర్పాటుపై స్పష్టత వస్తేనే..

16వ తేదీ నుంచి ముఖ గుర్తింపు హాజరు విధానం అమల్లోకి తీసుకు రావాలని పీఆర్ అండ్ ఆర్డీ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా ఇంత వరకు ఫేసియల్ రికగ్నిజేషన్ అటెండెన్స్ సిస్టమ్ పరికరాల ఏర్పాటుపై స్పష్టత రాలేదు. ఇదిలా ఉంటే, కొత్త హాజరు విధానం కోసం జెడ్పీ, మండల పరిషత్తు కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగుల సమాచారం, ఆధార్ వివరాలు సేకరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ చేపట్టేందుకు కనీసం మూడు, నాలుగు రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. పరికరాల సరఫరా, ఉద్యోగుల వివరాల సేకరణపై స్పష్టత వస్తేనే కొత్త హాజరు విధానం అమల్లోకి రానుంది. ఈ విధానం అమలైతే జెడ్పీ, పరిషత్తు కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు తమ కార్యాలయానికి వచ్చినప్పుడు, కార్యాలయం నుంచి తిరిగి వెళ్లే సమయంలో రెండు పర్యాయాలు ముఖ గుర్తింపు హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

డుమ్మా..

ఇక కుదరదమ్మో!

జెడ్పీ, మండల కార్యాలయాల్లో ముఖ గుర్తింపు హాజరు

అధికారులు, సిబ్బంది సేవలు పారదర్శకంగా ఉండేందుకు త్వరలో జిల్లా, మండల ప్రజా పరిషత్తు కార్యాలయాల్లో ముఖ గుర్తింపు హాజరు విధానం(ఫేషియల్ రికగ్నిజేషన్ అటెండెన్స్ సిస్టమ్) అమల్లోకి రానుంది. పరిషత్తు కార్యాలయాల్లో విధులు నిర్వహించే అధికారులు, కింది స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా రాకపోకలు కొనసాగిస్తున్నట్లు తమ తనిఖీల్లో గుర్తించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు ముఖ గుర్తింపు హాజరు విధానం అమల్లోకి తీసుకు రావాలని నిర్ణయించారు. కానీ నేటికీ ఉన్నతాధికారుల నుంచి సరైన మార్గదర్శకాలు జారీ కాని పరిస్థితి.

- ఇక ఇష్టానుసారంగా వస్తానంటే కుదరదు!
- 16నుంచే అమలుకు ఆదేశాలు.. కరువైన స్పష్టత
- పరికరాలు రాగానే వివరాల నమోదు ప్రక్రియ షురూ
- మార్గదర్శకాల కోసం అధికారుల ఎదురుచూపులు

వికారాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవల బదిలీపై వెళ్లిన పీఆర్ ఆర్డీ డైరెక్టర్ 16వ తేదీ నుంచి ఈ విధానం అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇంత వరకు ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఉన్నతాధికారుల నుంచి జారీ కాలేవు. ఫేషియల్ రికగ్నిజేషన్ అటెండెన్స్ సిస్టమ్ పరికరాలు ప్రభుత్వం సరఫరా చేస్తుందా? లేక ఏదైనా ఏజెన్సీకి ఆ బాధ్యతలు అప్పగించిందా? అనేది ఇంకా స్పష్టత రాలేదు. జెడ్పీ, మండల పరిషత్తుల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది వివరాలు సేకరించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి స్పష్టత రాగానే

మిగతా 8వ పేజీలో...

హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు

చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

శామీర్‌పేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ప్రజాప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి భరోసానిచ్చారు. మంగళవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని అంతాయిపల్లిలో నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 805 మంది లబ్ధిదారులకు రూ.8,5,93,380 విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు ప్రతీ నిరుపేదకు అందించాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమన్నారు. పేద రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో రైతు భరోసా నిధులు విడుదల చేశారన్నారు. అనంతరం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్, నక్క ప్రభాకర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ నర్సింలుయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మహేష్‌గౌడ్, కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి, తహసీలార్లు యాదగిరిరెడ్డి, సునీల్, అశోక్, సుచరిత, హసీన, రజనీ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ సర్వే నంబర్లే అధికం

మేడ్చల్ జిల్లాలో ముగిసిన రెవెన్యూ సదస్సులు

» జిల్లా వ్యాప్తంగా 2,845 దరఖాస్తులు

» త్వరలోనే పరిష్కరిస్తామన్న అధికారులు

మేడ్చల్, జూన్17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ భూభారతి (నూతన ఆర్వోఆర్) చట్టం అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 5 మండలాల్లో 81 గ్రామాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగిశాయి. కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవోలు నిత్యం క్షేత్రస్థాయి సదస్సుల్లో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో మొదట పైలెట్ ప్రాజెక్టు కింద కీసర మండలంలో ఈ సదస్సులు నిర్వహించారు. గతంలో ధరణిలో పరిష్కారం కాని సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు అందాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 2,845 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్లకు

మిగతా 8వ పేజీలో...



దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

విభాగాల వారీగా దరఖాస్తులు	
సర్వే నంబర్ మిస్సింగ్	752
పెండింగ్ మ్యుటేషన్, కోర్టు ఆర్డర్లు	378
డీఎస్ పెండింగ్	215
విస్తీర్ణం సవరణలు	269
భూమి స్వభావం	74
పట్టాదారు	84
పీవోబీ	182
అసైన్డ్ భూసమస్యలు	244
వోఆర్‌సీ	31
38ఈ సర్టిఫికెట్‌కు	10
సక్సెషన్	358
ల్యాండ్ ఆక్యుపేషన్	09
ఇతర సమస్యలు	242
మొత్తం	2,845



తీరనున్న సొంతింటి కల

వికారాబాద్ జిల్లాలో 22 గ్రామాలకు 2,280 ఇళ్ల మంజూరు 7

సాగుకు సన్నద్ధం

పొలం పనుల్లో అన్నదాతలు బిజీబిజీ 8

ఘట్‌కేసర్‌లో 3,500 ఎకరాల్లో వరిసాగు

ప్రభుత్వ స్కూల్లో కుమారుడిని చేర్పించిన ఉపాధ్యాయుడు

అభినందించిన తోటి టీచర్లు, స్థానికులు

యాలాల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన కుమారున్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పలువురి మన్ననలు పొందారు. యాలాల మండలం పగిడ్యాల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ అచ్యుతాపూర్ ప్రభుత్వ ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. తన కుమారుడు పిట్ల ప్రణయ్‌కుమార్‌ను పగిడ్యాల జెడ్పీహెచ్ఎస్(ఇంగ్లిష్ మీడియం)లో చేర్పించారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థి అడ్మిషన్ ప్రక్రియను ఆయన పూర్తి చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో విద్యాబోధన కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఆయన కోరారు. అదేవిధంగా శ్రీనివాస్ తన కుమారున్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం పట్ల తోటి ఉపాధ్యాయులు సైతం హర్షం వ్యక్తం చేశారు.



పగిడ్యాల్ పాఠశాలలో తన కుమారున్ని చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

అక్రమార్కులపై ఉక్కుపాదం



జిల్లా పోలీస్ కేంద్ర కార్యాలయం ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న డీజీపీ జితేందర్

» శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించొద్దు

» నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

» డీజీపీ డాక్టర్ జితేందర్

వికారాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని, శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరించాలని డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదేశించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన ఆయన గౌరవ వందనం స్వీకరించిన తర్వాత మొక్కలు నాటారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో మల్టీజోన్ -2 ఐజీ వి.సత్యనారాయణ, చార్మినార్ డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్, ఎస్పీ నారాయణరెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. నేరచరిత్ర ఆధారంగా రౌడీ షీట్లు తెరవాలని, పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రో-యాక్టివ్ పోలీసింగ్‌ను పటిష్టంగా అమలు చేయాలని, నేరాలు జరగక ముందే అడ్డుకట్ట వేయాలని సూచించారు. దొంగతనం కేసులను త్వరితగతిన ఛేదించాలన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. ఎన్డీపీఎస్ కేసులపై దృష్టి సారించి గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేయాలని, సరిహద్దు పోలీస్ స్టేషన్ల పరిధిలో నిరంతరం దాడులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట

పీడీఎస్, ఇసుక అక్రమ వ్యాపారం చేసే మాఫియాను ఉపేక్షించకూడదని, మట్కా, గేమింగ్ వంటి జూదాలకు అడ్డుకట్ట వేయాలని డీజీపీ స్పష్టం చేశారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళా నేరాలు, పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలను చైతన్యపరచాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలు, ఫామ్ హౌస్‌లతో పాటు వారాంతాల్లో జరిగే పార్టీలపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

హోంగార్డులకు హెల్త్ కార్డులు ఇవ్వండి..

హోంగార్డులకు హెల్త్ కార్డులు ఇప్పించాలని రాష్ట్ర హోంగార్డ్స్ ఆర్గనైజేషన్ కార్యదర్శి చాంద్‌పాషా, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, దశరథ్, రాములు డీజీపీ జితేందర్‌కు విజ్ఞప్తి చేశారు. హెల్త్‌కార్డులు లేక అనారోగ్యం పాలైన హోంగార్డులు వైద్యం కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయమై సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ వారు డీజీపీకి వినతిపత్రం అందజేశారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న శ్రీకాంత్

కడ్తాల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్స్ విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఎంఈవో సత్యనారాయణకు ఏబీవీపీ రాష్ట్రనాయకుడు క్యామ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కడ్తాలలో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అడ్మిషన్లు, ఫీజుల పేరుతో భారీగా డబ్బు దండుకుంటున్నారని పేర్కొన్నారు. 30 నుంచి 50 శాతం ఫీజును చెల్లిస్తేనే విద్యార్థులను అనుమతిస్తున్నారని, అర్హతలేని టీచర్లతో బోధన చేయిస్తున్నారని శ్రీకాంత్ పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కడ్తాల నగరకార్యదర్శి పవన్, సందీప్ ఉన్నారు.

సేంద్రియ ఎరువు.. దిగుబడి బాగు

- పశువులు, గొర్లు, మేకల ఎరువులు వాడితే భూ భౌతిక స్థితి మెరుగు
- అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు



నజ్దిక్‌సింగారంలోని ఓ పొలంలో గొర్ల మంద

యాచారం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పంటల దిగుబడి పెంచేందుకు సేంద్రియ ఎరువులు వాడాలని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. కొన్ని రోజులుగా వివిధ గ్రామాల్లో వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు యాచారం, చౌదర్‌పల్లి, నందివనపర్తి, గున్‌గల్ గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. కోళ్ల ఎరువు, పశువుల పేడ, కంపోస్ట్, మేకల, గొర్ల ఎరువు తరచూ వేయాలని సూచించారు. రసాయన ఎరువులు అధికంగా వాడితే నేల సహజత్వాన్ని కోల్పోతుందని తెలిపారు.

గొర్లు, మేకల మందలతో మేలు

మేకల, గొర్ల మూత్రంలో 13శాతం నత్రజని, 20 గ్రాముల పొటాషియం, పాస్ఫరస్ ఉంటాయని శాస్త్రవేత్తలు చెప్పారు. ఒక్క ఏడాది జీవాల ఎరువు వాడితే మూడేళ్ల వరకు ఎరువులు వేయకున్నా పంట దిగుబడి బాగా ఉంటుందని చెప్పారు. పశువుల ఎరువుల్లో కాల్షియం 1-1.4శాతం, మెగ్నీషియం 3-7శాతం, సోడియం 2-1.1శాతం, పొటాషియం3.6శాతం, పాస్ఫరస్ 15శాతం, సల్ఫేట్ 3-5శాతం, యూరిక్ యాసిడ్ 135గ్రాములుంటాయని అధికారులు తెలిపారు.



జమ చేసిన గొర్ల ఎరువు

సేంద్రియ ఎరువులే ఎక్కువ వాడుతా



నేను దుక్కి దున్నిన తరువాత పశువుల ఎరువు చల్లి మరోసారి దుక్కి దున్ని విత్తనాలు వేసుకుంటా. వరి సాగులో పశువుల, గొర్లు మేకల ఎరువులు వాడితే దిగుబడి పెరుగుతుంది. దుక్కులు దున్నగానే మేకల, గొర్లమంద పెడితే నేలసారవంతమైంతుంది. నేల చౌడు తగ్గుతుందని రైతులకు సూచిస్తున్నా. సేంద్రియ ఎరువులు వాడితే రైతులపై ఆర్థిక భారం తగ్గుతుంది.

\- కె.జోగిరెడ్డి, రైతు, నందివనపర్తి

సేంద్రియ సాగుతో తెగుళ్ల బెడద తగ్గుతుంది



పంటలకు పశువుల, మేకల గొర్ల ఎరువులు వాడితే తెగుళ్ల బెడద అంతగా ఉండదు. పంట దిగుబడి పెరుగుతుంది. సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తే పంట నాణ్యత పెరుగుతుంది. ఆర్థిక భారం తగ్గుతుంది. రసాయన ఎరువుల వాడకాన్ని సాధ్యమైంతన తగ్గించాలి. పశువుల ఎరువుకు తోడు మేకల గొర్ల మందలను పొలాల్లో పెట్టిస్తే నేలసారవంతంగా మారుతుంది.

\- రవినాథ్, ఏవో, యాచారం

పాఠశాల స్థలంపై అధికారుల విచారణ

పెద్దేముల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి):తమ భూమిలో ప్రభుత్వ పాఠశాల నిర్మించారని, తమకు పరిహారమివ్వాలని నెల్లిగడ్డతండాకు చెందిన రమేష్ గత నెలలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం అధికారులు విచారణ జరిపారు. ఎంపీడీవో రతన్‌సింగ్, సీడీపీవో శ్రీలక్ష్మి మంగళవారం కొండాపూర్ పాఠశాలకువెళ్లి విచారణ జరిపారు. స్కూల్ 1999లో, అంగన్‌వాడీ భవనం 2010లో నిర్మించినట్లు గుర్తించారు. రమేష్ తల్లిదండ్రులు పాఠశాలకు భూదానం చేశారని తేలింది. రమేష్ సోదరుడే కాంట్రాక్ట్‌పై పాఠశాలను నిర్మించినట్టు తేల్చారు. రమేష్ తల్లిదండ్రుల మృతితో 2008లో ఆర్వోఆర్‌లో భూమి అతడి పేరిట నమోదైంది. దీంతో పాఠశాల భూమి తనది, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. గ్రామస్తులతో జరిపిన విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటు



నియామక పత్రాన్ని అందజేస్తున్న వెంకటేష్‌గౌడ్

కందుకూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని నేదునూరు, మాన్యగూడ, ఆకులమైలారం గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సౌడపు వెంకటేష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీలతో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ మేరకు నేదునూరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎం.మహేందర్, ఉపాధ్యక్షులు ఎ.సుధాకర్, జి.సాయికిరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొహైల్‌బేగ్, కుక్క మహేష్, సోషల్ మీడియా ప్రెసిడెంట్ బైకం లోకేష్‌యాదవ్, మన్యగూడ గ్రామ శాఖ అధ్యక్షుడిగా వరికుప్పల శివకుమార్, ఉపాధ్యక్షులు ఎగిరిశెట్టి గణేష్, వి.శివకృష్ణ, ప్రధాన కార్యదర్శులు వి.చింటు, బి.ప్రేమ్‌కుమార్, సోషల్ మీడియా ప్రెసిడెంట్‌గా వి.శ్రీనివాస్, ఆకులమైలారం అధ్యక్షుడిగా మేకం రమేష్, ఉపాధ్యక్షులు ఎల్.మహేందర్, జి.ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు ఆర్.శివకుమార్, సోషల్‌మీడియా ప్రెసిడెంట్‌గా జి.శివలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏఎంసీ డైరక్టర్లు సురేందర్, పుష్పాదర్శన్, శమంత ప్రభాకర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, జి.కళమ్మరాజు, ఎండీ అఫ్జల్ బేగ్, రాంరెడ్డి, సురేష్, గౌర శ్రీశైలం, గాదె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాం

యాలాల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ఎల్లప్పుడూ అండగా ఉండి ఆదుకుంటామని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అగ్గనూరుకు చెందిన ఉప్పరి వెంకటయ్య, ఉప్పరి కల్పన అనారోగ్యంతో ఆసుపత్రి పాలై ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. వీరికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.82వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు వెంకటయ్య కుటుంబానికి రూ.40వేలు, కల్పన కుటుంబానికి రూ.42వేల విలువగల చెక్కులను మహేందర్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం తమ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శాంతు, వెంకటయ్య, శివా తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

కేజీబీవీల్లో నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతానర్సింహ

కడ్తాల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు అనుగుణంగా విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ కస్తూర్బా బాలికల పాఠశాల నిర్వాహకులకు సూచించారు. విద్యా సంస్థల బలోపేతం, పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. కడ్తాలలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం గీత సందర్శించారు. పాఠశాల రికార్డులను, పరిసరాలను, విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. పాఠ్యపుస్తకాలను విద్యార్థినులకు పంపిణీ చేశారు. బాలికలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థినులతో కలిసి ఆమె భోజనం చేశారు. ఎస్వో అనిత, టీచర్లు తదితరులు ఉన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు



బాలికకు అడ్మిషన్ పత్రాన్ని అందజేస్తున్న ఉప్పల ట్రస్ట్ సభ్యులు శ్రీశైలం, గోపాల్‌నాయక్

తలకొండపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డుకాదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తిరుమణి శ్రీశైలంగౌడ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరు చేయూతనిచ్చి ప్రోత్సహించాలని కోరారు. సంగాయిపల్లి గ్రామానికి చెందిన రమాదేవి భర్త నరేశ్ అకాల మరణంతో కూతురు పల్లవిని చదివించేందుకు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను ఆశ్రయించారు. దీంతో స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పల్లవి చదువుకు తోడ్పాటునందించాడు. దీంతో ట్రస్ట్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, గోపాల్‌నాయక్ పల్లవికి పాఠశాల అడ్మిషన్‌ను అందజేశారు. ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పేద పిల్లలకు తోడ్పాటు నందిస్తున్న వెంకటేశ్‌ను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహ, నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పురస్కారాల అందజేత

షాద్‌నగర్ రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందించారు. మండలంలోని బూర్గుల కేంద్రంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీ మంగళవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసి సమావేశంలో అందించారు. టెన్త్‌లో 450కిపైగా మార్కులు సాధించిన 450మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పుస్తకాలు అందజేశారు. అలాగే తమ సబ్జెక్టుల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యా బోధన చేసిన 70మంది ఉపాధ్యాయులకు మెమొంటోలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దీనాశంకర్, మురళీకృష్ణ, జగదీష్, కార్తీక్, శ్రీకాంత్, తులసి, శ్వేత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు, ప్రశంశాపత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

వైఖరి మారకుంటే పీడీ యాక్ట్

- తాండూరు ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

తాండూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, సారా విక్రయిస్తూ పట్టుబడి బైండోవరైన 15మంది తిరిగి అక్రమ కార్యకలపాలు కొనసాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వైఖరి మారకుంటే వారిపై పీడీ యాక్ట్ పెడతామని తాండూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తహసీల్దార్ వద్ద బైండోవర్ అయిన 15మందిలో ఇప్పటి వరకు ఏడుగురు రూ.2.70లక్షల జరిమానా చెల్లించారని వెల్లడించారు. జరిమానా చెల్లించని 8మంది షోకాజ్ నోటీసులు తీసుకొని తప్పించుకుంటున్నారని తెలిపారు. చలానా, జరిమానా చెల్లించకుంటే ఏడాది పాటు జైలుశిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. తాండూరు పట్టణం మాణిక్‌నగర్, ఇంద్రానగర్, విలియంమూన్ మైదాన్, తట్టేపల్లిలో గంజాయి విక్రయిదారులు ఉన్నారని తెలిపారు. ఎన్ఫోర్స్‌మెంట్ టీం, ఎక్సైజ్ టీం సంయుక్తంగా దాడులు నిర్వహిస్తోందని సీఐ చెప్పారు.

వారం రోజులుగా నీటి కటకట

- పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్
- నాలుగు మండలాల్లో నీటి తిప్పలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

చేవెళ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల అలసత్వం, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో వారం రోజులుగా నాలుగు మండలాల్లో తాగునీటి కటకట నెలకొంది. ప్రజలు తాగునీటికి వ్యవసాయ బోర్లు, ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. అయితే వారం రోజుల క్రితం షాబాద్ మండలం అంతారంలో మెయిన్‌లైన్ పైప్ పగిలిపోయింది. అప్పటి నుంచి గ్రామాలకు నీరు రావడం లేదు. వ్యవసాయ పనుల ఊపందుకుంటున్న, పిల్లలు స్కూళ్లకు వెళ్తున్న ఈ సమయంలో



చేవెళ్లలో ట్యాంకర్ నీరు పట్టుకుంటున్న ప్రజలు

నీరురాక కష్టతరంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. పాత బోర్లనుంచి నీరు సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా అవి పనిచేయడం లేదు. వ్యవసాయ బోర్లు, ట్యాంకర్ల వద్ద నీరు తెచ్చుకుంటున్నారు. పట్టణాల్లో ఒకటి రెండు కాలనీలకు ఒక్క ట్యాంకర్‌ను పంపుతున్నా సరిపోవడం లేదు. చాలా కాలనీలకు ట్యాంకర్లు పోవడం లేదు. పైప్‌లైన్ సరిచేసేందుకు ఎన్ని రోజులు తీసుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ బోర్లను రీస్టార్ట్ చేసుకోవాలని అధికారులు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా గ్రామాలు, పట్టణాల్లో నీటి సరఫరా జరగడం లేదని ప్రజలంటున్నారు. పొలం పనులు మానుకొని నీటి కోసం వెంపర్లాడుతున్నామని జనం వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు భగీరథ పైప్‌లైన్‌కు రిపేర్ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యపై చేవెళ్ల మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గీతాస్రవంతి స్పందిస్తూ.. పగిలిపోయిన పైప్‌లైన్‌కు రిపేర్ చేయిస్తామని చెప్పారు. మిషన్ భగీరథ నీరు రావడానికి ఇంకా రెండు రోజుల సమయం పడుతుందని తెలిపారు. అప్పటి వరకు పంచాయతీ బోర్ల నీటిని సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించామని వివరించారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

» కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్

మర్పల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ అన్నారు. రైతుభరోసా నిధులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుండడంతో మంగళవారం బూచన్‌పల్లిలో రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రఘుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహేందర్, బల్వంతరెడ్డి, మామిడి రాములు, రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్, రంగయ్య పాల్గొన్నారు.

ఏకకాలంలో రైతు భరోసా జమ

యాలాల: రైతుభరోసా పథకం డబ్బులు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తిమ్మాయిపల్లి రాజు పేర్కొన్నారు. సోమవారం రాత్రి నుంచే డబ్బులు జమవుతున్నాయని తెలిపారు. మంగళవారం ఎకరానికి రూ.6వేల చొప్పున 3ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బు జమచేశారని చెప్పారు. మరో ఏడు రోజుల్లో అందరు రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని వారు పేర్కొన్నారు.



సీఎం, స్పీకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రవీందర్, నాయకులు

తీరనున్న సొంతింటి కల

● హర్షం వ్యక్తం చేస్తున్న పేదలు ● జిల్లాలో 22 గ్రామాలకు 2,280 ఇళ్ల మంజూరు

కొడంగల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరనుంది. మండలానికో గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేశారు. కోస్గి మండలం చంద్రవంచలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పథకాన్ని ప్రారంభించారు. రూ.5లక్షలతో ఇంటిని నిర్మిస్తారు. ఇంటిని 450 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపు పిల్లర్లతో కట్టుకోవాలనే నిబంధన పెట్టారు. జిల్లాలో మండలానికో గ్రామం చొప్పున 22గ్రామాలను ఎంపిక చేసి 2,280ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. నిర్మాణానికి రూ.5లక్షలు నాలుగు విడతల్లో బిల్లులు చెల్లిస్తారు. బేస్మెంట్ పూర్తిచేస్తే రూ.1లక్ష, రూఫ్ లెవల్ వరకు పిల్లర్లు, గోడలు కట్టుకుంటే రూ.1లక్ష, స్లాబ్‌వేస్తే రూ.2లక్షలు, మరుగుదొడ్డి, ఫ్లోరింగ్ తదితర చివరి పనులన్నీ పూర్తిచేస్తే చివరి లక్ష ఇస్తారు. జియో ట్యాగింగ్ చేసి పునాది నుంచి నాలుగు విడతల ఫొటోలను అప్‌లోడ్లతో బిల్లులు ఖాతాలో జమచేస్తున్నారు. కాగా నిబంధనల మేరకు నిర్మించుకుంటే గదులు చిన్నగా ఉంటున్నాయని చాలా మంది కట్టుకోవడం లేదని తెలుస్తోంది. విస్తీర్ణాన్ని 900అడుగుల నుంచి వెయ్యి అడుగులకు పెంచాలని కోరుతున్నారు.



బేస్మెంట్ లెవల్ పూర్తయిన నిర్మాణం

నత్తనడకన నిర్మాణాలు

మోడల్ గ్రామాల్లో 200 నుంచి 300 వరకు ఇళ్లను మంజూరు చేశారు. మంజూరై 45రోజులైనా నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. 22 గ్రామాలకు 2,280ఇళ్ల మంజూరు కాగా 720 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 167 నిర్మాణాల బేస్మెంట్ పూర్తయ్యాయి. 17 రూఫ్ లెవల్‌కు, నాలుగు స్లాబ్ లెవల్‌కు వచ్చాయని అధికారులు తెలిపారు. ప్రొసీడింగ్‌లిచ్చిన నిర్మాణాలను 45 రోజుల్లో పూర్తి చేసుకోవాలని నిబంధనపెట్టినా ఆ మేరకు పనులు చేయడం లేదు. ఖాళీ స్థలాల్లేక, పాతిళ్లను కూల్చేందుకు ఆసక్తి చూపక, చిన్నగా కట్టుకోవాలనే నిబంధన వంటి అడ్డంకులొస్తున్నాయి. అప్పుచేసి పనులు మొదలుపెట్టినా బిల్లుల ఆలస్యమవుతున్నాయి. ఇష్టానుసారం కట్టేవారికి బిల్లులు రావడం లేదు.

కొడంగల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు

మండలం	గ్రామం	మంజూరు	ప్రారంభం	బేస్మెంట్ లెవల్
కొడంగల్	అన్నారం	206	52	16
బొంరాస్‌పేట్	నాగిరెడ్డిపల్లి	97	25	18
దౌల్తాబాద్	నందారం	27	18	4
దుద్యాల్	సంగాయిపల్లి	62	46	16
మొత్తం		392	141	54

కల నెరవేరనుంది

ఇంటి మంజూరుతో గూడులేని నాకు సొంతింటి కల నెరవేరడం సంతోషంగా ఉంది. రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తికి నిబంధనల మేరకు పనులు చేస్తున్నాం. ఇల్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- సంతోష, లబ్ధిదారు, అన్నారం

నిబంధనలు సడలిస్తే బాగుంటుంది

ఇంటి నిర్మాణాల్లో నిబంధనలు కఠినంగా ఉన్నాయి. సడలిస్తే బాగుంటుంది. లబ్ధిదారులు తమకు అనుకూలంగా నిర్మాణం పూర్తి చేసుకున్నా బిల్లులు ఇవ్వాలి. 400-600చదరపు అడుగుల నిబంధన ఇబ్బంది కల్గిస్తోంది. తక్కువ విస్తీర్ణంలో ఇల్లు కడితే ఇరుగ్గా ఉంటుంది. కనీసం వెయ్యి చదరపు లడుగుల స్థలంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అనుమతివ్వాలి.

- వెంకటమ్మ, లబ్ధిదారు, సంగాయిపల్లి

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేయాలి. బేస్మెంట్ పూర్తయిన వారికి బిల్లులు మంజూరయ్యాయి. కొడంగల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల మేరకు కట్టుకుంటేనే బిల్లులు అందుతాయి.

- హేమ్‌చందర్‌నాయక్, హౌసింగ్ డీఈ



కళాశాలలో సమావేశమైన అధ్యాపకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య

బొంరాస్‌పేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా చౌదర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యాభివృద్ధి, సదుపాయాల కల్పన కోసం నిధులు మంజూరు చేస్తుందన్నారు. విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరేందర్, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్కు రైతులకు రూ.10.75 కోట్ల పరిహారం అందజేత



చెక్కును అందజేస్తున్న తహసీల్దార్ కిషన్‌నాయక్

తాండూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు(ఎంపీఐపీ) ఏర్పాటుకు భూములు అందజేసిన రైతులకు రూ.10.75కోట్ల విలువైన చెక్కులను మంగళవారం తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. దుద్యాల తహసీల్దార్ కిషన్ నాయక్ చేతుల మీదుగా హకీంపేట్ గ్రామానికి చెందిన 29 మంది రైతులకు 53.30ఎకరాల భూమికి సంబంధించిన పరిహారాన్ని అందజేశారు. ల్యాండ్ అక్విజేషన్ కింద ఈ పరిహారాన్ని అందజేసినట్లు తహసీల్దార్ వివరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం ముందుకు వచ్చి భూములు అందించిన రైతులు తమకు వచ్చిన పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తడి, పొడి చెత్తపై అవగాహన

మేడ్చల్ టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపాలిటీ 12వ వార్డులో మంగళవారం తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త సేకరణకు ఇంటి వద్దకు వచ్చే మునిసిపల్ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. ప్రజలు వీధులను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్‌చందర్, ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ప్రియాంక పాల్గొన్నారు.



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న ఎంపీ రాజేందర్

మురుగునీటి వ్యవస్థ ఆధునికీకరణకు చర్యలు

కీసర రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో మురుగునీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలో బీఎంఆర్, ఇతర కాలనీల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డితో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. గొలుసుకట్టు నాలాలను పరిగణనలోకి తీసుకోకుండా వెంచర్లు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. దీంతో మురుగు, వరద నీరు పోయేందుకు కాలువల్లేక ఇళ్లల్లోకి వరద చేరుతోందన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రధాన రహదారి గుండా దాయరకుంట వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణానికి హెచ్ఎండీఏ నుంచి రూ.10కోట్లు మంజూరు చేయించినట్టు ఎంపీ వెల్లడించారు. త్వరలోనే పనులు చేపడుతామని వివరించారు. ఎంపీ వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, స్థానికులు ఉన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

తాండూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు మంగళవారం సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కాగ్నా నది నుంచి రాత్రింబవళ్లు ఇసుక తోడుకొని అమ్ముకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరం మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అంతారం లలిత, ఉపాధ్యక్షులు రాజు, సంగమేశ్వర్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తొలగిన మురుగు

తాండూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం వినాయక్‌చౌక్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని పారదోలేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో 'రోడ్డుపైకి మురుగు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం శానిటేషన్ జవాను రమేష్, పారిశుధ్య సిబ్బంది మురుగు నీటిని తొలగించి శుభ్రంచేశారు. దీంతో ప్రజలకు, వ్యాపారులకు, పాదచారులకు తాత్కాలికంగా ఇబ్బందులు తొలగాయి.



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు

పశువులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

మేడ్చల్ టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పశువులకు టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి కురుమూర్తి అన్నారు. మంగళవారం రావల్‌కోల్‌లో గొర్రెలకు ఈటీ వ్యాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ... పశువులను ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో పశువులకు వివిధ వ్యాధులు సోకే ఆస్కారం ఉంటుందన్నారు. కాబట్టి పశువులకు టీకాలు తప్పక వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు, రైతులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

శామీర్‌పేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారి కమలాకర్ ఆధ్వర్యంలో తూంకుంటలోని రాష్ట్రస్పోర్ట్స్ స్కూల్‌కు మంగళవారం శామీర్‌పేటలోని మినీ స్టేడియంలో మండల స్థాయి సెలక్షన్లు నిర్వహించారు. ఎంఈఓ, పీడీ, పీఈటీలు విద్యార్థులకు ఫిజికల్ పరీక్షలను నిర్వహించారు. 12మంది విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. తుది ఎంపిక జిల్లా స్థాయిలో జరుగుతుందని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సత్తిరెడ్డి, గోపాల్‌చారి, పీఈటీలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు పర్మిట్.. అక్రమంగా డంప్

» జర్నలిస్టు కాలనీ పేరిట ఇసుక రవాణాకు అనుమతి

» కొత్త ఇళ్ల వద్ద డంపింగ్ » రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



ఓ ఇంటి ముందు డంప్ చేస్తున్న ఇసుక

తాండూరు/తాండూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు కాలనీలో పనులే ప్రారంభం కాలేదు. మార్కింగ్ కూడ చేయలేదు. అక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి 30లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు మొదలు కాలేదు. ఇప్పుడే పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాత్రం ఇసుక పర్మిట్లు జారీ చేస్తున్నారు. దీంతో ఇసుక మాఫియా తాండూరులో ఎక్కడ ఇల్లు కడితే అక్కడ ఇసుకను డంప్ చేస్తూ డబ్బులు దండుకుంటోంది. అంతారం పరిధిలో జర్నలిస్టు కాలనీ ఉంది. ఇసుకను కాగ్నా నది నుంచి తెచ్చి తాండూరులోని సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి, పాత తాండూరు, గౌతాపూర్ ప్రాంతాల్లోని ఇళ్లకు అమ్మేస్తున్నారు. మంగళవారం ఓ ట్రాక్టర్ ఇసుకను జర్నలిస్టు కాలనీలో సీసీ రోడ్డుకని సాయిపూర్‌లో డంప్ చేశారు. విలేకరులు ప్రశ్నిస్తే బెదరింపు ధోరణిలో ఇసుక మాఫియా ప్రవర్తిస్తోంది. ఈ విషయమై తహసీల్దార్ తారాసింగ్ స్పందిస్తూ.. పర్మిట్ ఇచ్చిన దానికే ఇసుక వాడాలని, పక్కదారి పట్టిస్తే పర్మిట్లు రద్దు చేయడంతో పాటు ఇప్పటి వరకు తరలించిన ఇసుకపై జరిమానా వసూలు చేస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే ఇసుక పర్మిట్లు తాము జారీ చేయం అని, రెవెన్యూ శాఖనే జారీ చేస్తుందని పంచాయతీ రాజ్ ఏఈ నందిని చెప్పడం గమనార్హం.

బీజేపీ పథకాలను వివరించాలి

మేడ్చల్ టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు తెలియజెప్పే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని మేడ్చల్ పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజ అన్నారు. బీజేపీ పాలన 11ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా.. మంగళవారం మేడ్చల్‌లో నాయకులు పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. శైలజ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాలతో అనేక మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతోందన్నారు. ఉచిత రేషన్, గ్రామీణ రోడ్ల ఆధునికీకరణ, ఆరోగ్య పథకాలు, జాతీయ రహదారులు తదితర కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రం ఇస్తున్న బీజేపీ అధ్యక్షురాలు శైలజ



సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు మల్లారెడ్డి

సమాజ హితానికి సాహిత్యం దోహదం

వికారాబాద్, జూన్17(ఆంధ్రజ్యోతి): సాహిత్యం సమాజంలోని చెడును తొలగించి హితాన్ని పెంచుతుందని, విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని భువనగిరి ఎస్ఎల్ఎన్ డిగ్రీ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపాల్ తూర్పు మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నవాబుపేట మండలం తిమ్మారెడ్డిపల్లిలో నంబియార్ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన పద్యపదభారతి నూతన సాహితీ సంస్థ ఏర్పాటు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పద్య పద భారతి సంస్థ ద్వారా విద్యార్థులకు పద్య కంఠస్థ పోటీలు, సాహిత్య సంబంధ కార్యశాలలు, కవి సమ్మేళనాలు, పండుగలు, జాతరల్లో ధార్మిక ప్రసంగాలు చేయించి ప్రజల్లో చైతన్యం తేవాలని కోరారు. డాక్టర్ చంద్రప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అంతరించిపోతున్న జానపద కళలు, పౌరాణిక పద్య నాటకాలు, యక్షగానాలకు ప్రాణంపోయాలని, బాల కవులను భావి కవులుగా తీర్చిదిద్దాలని సూచించారు. పద్య పదభారతి అధ్యక్షుడిగా రాఘవేంద్రాచార్యులు, గౌరవాధ్యక్షులుగా బందెప్పగౌడ్, వెంకటదాసులు, ఉపాధ్యక్షులు విశ్వనాథం, శ్రీపాదశర్మ, కరణం మాణిక్‌రావు, నరసయ్య, కార్యదర్శి ఎం.రాజు, సహకార్యదర్శులు సుధాకర్‌గౌడ్, పరమేశ్వర్, వెంకట్, సాంస్కృతిక కార్యదర్శి మల్కానెల్లి లాల్‌రెడ్డి, కోశాధికారి రెడ్యారాథోడ్‌లను ఎన్నుకున్నారు.



బెల్కటూర్‌లో టీబీ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బెల్కటూర్‌లో టీబీ నిర్ధారణ పరీక్షలు

తాండూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి):జినుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బెల్కటూర్ సబ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురుకి టీబీ, ఎన్జీవో ఆధ్వర్యంలో హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రషీద్ మాట్లాడుతూ.. రక్తపోటు, హెచ్ఐవీ, ఓల్డ్ టీబీ, మధుమేహం వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలున్న వారికి కళ్లె పరీక్ష చేశారు. అవసరమైన వారికి ఎక్స్‌రే కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. వ్యాధి ఉన్న వారికి 6నెలల మందులు, రూ.వెయ్యి ఇస్తామని వైద్య లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్, సూపర్‌వైజర్ నీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, ఏఎన్ఎం పుష్ప, సంపూర్ణ ఎన్జీవో అవుట్ రీచ్ వర్కర్స్ జ్యోతి, ఇందు, కృష్ణవేణి, ఎన్జీవో, సూపర్‌వైజర్ హర్షవర్ధన్, ఆశా కార్యకర్తలు రాధమ్మ, భాగ్యమ్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

వికారాబాద్, జూన్17 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. 2026 యూపీఎస్సీ పరీక్షల కోసం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి తెలిపారు. ఎంపికైనా అభ్యర్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు జూలై 4 లోపు హెచ్‌టీటీపీ://స్టడీసర్కిల్.సీజీజీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకూడదన్నారు. మరిన్ని వివరాలకు 6281766534 నంబర్‌లో సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి

» క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఆమనగల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం, క్లబ్ 40వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. కడ్తాల మండలం మైసిగండి ఎమ్మార్జీ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి క్లబ్ జిల్లా గవర్నర్ జి.మహేందర్ కుమార్‌రెడ్డి, మాజీ గవర్నర్లు జి.చెన్నకిషన్‌రెడ్డి, జూలూరి రమేశ్‌బాబు, సందడి నరేందర్‌రెడ్డి, శ్యామ్‌కుమార్, మాజీ వైస్ గవర్నర్ సురేశ్ జగ్గా, రీజియన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, జోన్ చైర్మన్ లింగయ్య ముఖ్య అతిథులుగా వచ్చారు. ఆమనగల్లు క్లబ్ అధ్యక్షుడిగా కె.గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్వో ఎంఏ.పాషా, ఉపాధ్యక్షుడు ఎంగళి బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి కొరివి వెంకటయ్య, టేమర్‌గా చేగూరి వెంకటేశ్, టెల్ ట్విస్టర్‌గా మోహన్‌రెడ్డి, లియోక్లబ్ అధ్యక్షుడిగా జె.శ్యామ్‌సుందర్, కార్యదర్శి శశీందర్, కోశాధికారి ధర్మేందర్‌లతో ఇన్‌స్టలేషన్ చైర్మన్ ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్, కో-చైర్మన్‌లు వెంకటేశ్, జహంగిర్ అలీ ప్రమాణం చేయించారు. క్లబ్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ప్రగతి నివేదికను మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ వెల్లడించారు. అనంతరం సమావేశంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సేవలను ఏటేటా విస్తరిస్తున్నట్లు చెప్పారు. గ్రామాలు, తండాల్లో వైద్య శిబిరాలు, ప్రజాచైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఆమనగల్లు క్లబ్ రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలవడం, యూఎన్ఓలో సభ్యత్వం పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు ఉప్పల వెంకటేశ్, అనురాధ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, లయన్స్‌క్లబ్ సభ్యులు వీరబొమ్మ భిక్షపతి, దామోదర్‌రెడ్డి, రమేశ్, బి.రామచంద్రారెడ్డి, ఎం.అంజయ్య, చంద్రశేఖర్, సుధీర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, కృష్ణ, కొండల్‌రెడ్డి, పాండురెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ఓంకారం, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు



లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి

నారుమడిలో జాగ్రత్తలు పాటించాలి

● కీసర మండల వ్యవసాయ అధికారి మాధవీలత



ముఖాముఖి

కీసర రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతులు వరిసాగుకు, అందులోనూ సన్నరకాలు సాగు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో నారు మడి సిద్ధం చేసుకోవటంలో జాగ్రత్తలు పాటించాలని కీసర మండల వ్యవసాయాధికారి(ఏవో) మాధవీలత సూచించారు. ఆమె మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో వరిసాగు ఎన్ని ఎకరాలు?

ఏవో: వానాకాలం సీజన్‌లో కీసర మండలంలోని అన్నదాతలు దాదాపు 2400ఎకరాల్లో వరి సాగుచేస్తారు. అందులో 70శాతం సన్నరకాలు, 30శాతం దొడ్డు రకాల ధాన్యాన్ని సాగు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఎప్పటి వరకు నారు పోసుకోవచ్చు?

ఏవో: వరి రకాలను బట్టి మే చివరి వారం నుండి జూలై 30వరకు నారు పోసుకోవచ్చు. దీర్ఘకాలిక(150)రకాలను వేసుకునే రైతులు జూన్ 15వరకు, మధ్యకాలిక రకాలు జూన్ 15నుంచి జూన్30 వరకు, స్వల్పకాలిక రకాలు జూలై 15వరకు, అతిస్వల్ప రకాలు జూలై 30వరకు నారు పోసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: నారుమడిని ఎలా సిద్ధం చేసుకోవాలి?

ఏవో: నారు మడిని లోతుగా దమ్ము చేసుకోవద్దు. 3గ్రాముల బావిస్టిన్ లేదా 1గ్రామ్ కార్బండైజమ్‌తో విత్తన శుద్ధిచేసుకోవాలి. సేంద్రియ ఎరువులు వాడుకోవాలి. నారుచల్లిన తర్వాత నారు పచ్చబడేంత వరకు నీరుపలచగా పెడుతూ తీస్తూ ఉండాలి. 4కిలో గ్రాముల యూరియాను రెండు దఫాలుగా వేసుకోవాలి. డీఏపీ ఒక కేజీ, పొటాష్ 2కేజీలు, యూరియాతో కలిపి చల్లుకోవాలి.

ఆంధ్రజ్యోతి: చీడపీడల నివారణ ఎలా?

ఏవో: చీడపీడల నివారణకు నారు పీకే వారం ముందు ఒక కిలో కార్బోఫోరాన్ 3జీ గులికలను వేసుకోవాలి. జింకులోపం ఉంటే ఒక కిలో జింకు సల్ఫేట్‌ను చల్లుకోవాలి. కలుపు నివారణకు నామినిగోల్డ్ మందును 0.5మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి 15 నుంచి 20 రోజుల నారుమడిలో స్ప్రే చేసుకోవాలి. నారు వేర్లను క్లోరోఫైరిపాస్ ద్రావణంలో ముంచి నాటితే మంచిది. నారు కొనలను తుంచి నాటు వేయడం వలన కాండం తొలుచుపురుగు ఉధృతి తగ్గుతుంది.

వానాకాలం సాగుకు సన్నద్ధం

● దున్నకాల్లో అన్నదాతలు బిజీ బిజీ
● ఘట్‌కేసర్‌లో 3,500 ఎకరాల్లో వరిసాగు
● అందుబాటులో విత్తనాలు, ఎరువులు: వ్యవసాయ అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభంకాగానే రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. తమ పొలాల్లోని గడ్డి, చెత్తాచెదారాన్ని శుభ్రంచేసి కల్పడం వంటి పనులు పూర్తిచేసుకున్నారు. నారుమడులను సిద్ధం చేసుకొని మరో 15 నుంచి 20 రోజుల్లో వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కొండాపూర్, అవుశాపూర్, అంకుశాపూర్, ఘట్‌కేసర్, మర్రిపల్లిగూడల్లో రైతులు ముందుగానే నారుమడులను సిద్ధం చేసుకున్నారు. మూసీపరివాహక ప్రాంత గ్రామాలైన ఎదులాబాద్, పోతరాజుగూడ, మాదారం, కొత్తగూడెం, కొర్రెముల, వెంకటాపూర్, ప్రతాప్‌సింగారం, కాచవానిసింగారం, ముత్వేల్లిగూడ తదితర గ్రామాల్లో వారంరోజులు ఆలస్యంగా నారుపోసుకున్నారు. ఈ సీజన్‌లో సన్నరకాలైన బీపీటీలు, తెలంగాణ సోన, నెల్లూరు సోన రకాలను ఎక్కువగా



ఎదులాబాద్‌లో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

వాడుతున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో దొడ్డు రకాలైన ఎంటీ యు 1010, ఐఆర్ 64, కావేరి 368, ఒక కర్ర రకం, రాశి 113, రాశి 118, ఎంపీ 3030విత్తనాల రకాల నారు పోసుకున్నారు. మండలంలో దాదాపు 3500ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. ఘట్‌కేసర్ రైతుసేవా సహకారం సంఘంతో పాటు అథొరైస్డ్ డీలర్లు అంబిక, ఎన్ఎస్ సీడ్స్ దుకాణాల్లో వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఘట్‌కేసర్, ఎదులాబాద్ రైతు సేవాసహకార సంఘాల్లో ఎరువులను అందుబాటులో ఉంచారు.

దుక్కులు సిద్ధం చేసుకుంటున్నాం



ఆరు ఎకరాల్లో దుక్కులను సిద్ధం చేసుకుంటున్నాం. పొలంలో ఉన్న చెత్తాచెదారాన్ని తగలబెట్టడం, గట్లను సరిచేయడం వంటి పనులు చేసుకుంటున్నాం. నెల్లూరు సోనా రకం నారు పోశాను.

- మాయ శివకుమార్, రైతు, మర్రిపల్లిగూడ

ఎరువులు అందుబాటులో ఉంచాం



మండలంలో యాసంగి సాగు కింద దాదాపు 3,200 ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. దుక్కులు సిద్ధం చేసుకునే సమయంలో పొటాష్, యూరియా, డీఏపీ సగం బ్యాగ్ వేసి దున్నితే పైరుకు చీడపీడలు ఆశించవు. అంతేకాకుండా వరి పైరు ఏపుగా పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది.

- లావణ్య, మండల వ్యవసాయ అధికారి

పత్తి సాగు ముమ్మరం

బషీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో రైతులు పత్తి సాగు ముమ్మరం చేశారు. ఈ ఏడాది రైతులు అత్యధికంగా పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 35ఎకరాలకు పైగా సాగుభూమి ఉంది. ఇందులో ఈ ఏడాది పత్తి 14,500వేల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది 13వేల పైచిలుకు ఎకరాల్లో రైతులు పత్తి పండించారు. గతంలో కంటే ఈసారి 1,500 ఎకరాలు పెరుగుతుందని వ్యసాయాధికారులు అంచనాలు రూపొందించారు. కానీ అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం కేంద్రం పత్తి మద్దతు ధరను క్వింటాకు రూ.580పెంచింది. దీంతో పత్తిధర క్వింటాలుకు రూ.8,110కు చేరగా రైతులకు మేలు చేకూరుతోంది.



కాశింపూర్ వద్ద పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

మిస్సింగ్ సర్వే నంబర్లే అధికం

(ఐదో పేజీ తరువాయి)

సంబంధించిన సమస్యలపై అధికంగా 752 దరఖాస్తులు వచ్చాయి. సాదాబైనామా కింద 122 దరఖాస్తులు అందాయి. సాదాబైనామా ద్వారా క్రమబద్ధీకరించే అవకాశం జిల్లాలో లేదు. మిస్సింగ్ సర్వే నంబర్లు, పెండింగ్ మ్యూటేషన్లు, కోర్టు ఆర్డర్లు, విస్తీర్ణం సవరణ వంటి దరఖాస్తులు రైతుల నుంచి అధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు విభజన చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

పరిశీలించి పరిష్కరిస్తాం

రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను పరిశీలన జరిపి, దరఖాస్తు ఏ విభాగంలోకి వస్తుందో నిర్ణయించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిష్కరిస్తాం. ఈ నెల చివరి వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. అనంతరం సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతాం. **- విజయేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్**

‘భూభారతి’తో సమస్యలకు పరిష్కారం

దుద్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతిని ప్రవేశపెట్టిందని అదనపుకలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మండలంలోని హకీంపేట్‌లో మంగళవారం చివరి రోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. హకీంపేట్‌లో 9 దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ కిషన్‌నాయక్ తెలిపారు. దుద్యాల మండలవ్యాప్తంగా నిర్వహించిన సదస్సుల్లో 310 దరఖాస్తులు వచ్చినట్లు తలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్ఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



దుద్యాల: హకీంపేట్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

నవాబుపేట: ఎల్లకొండ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ రాజు, రజిత, మాజీ సర్పంచ్ రావుగారి వెంకటిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దోమ: ఖమ్మం నాచారం, మల్లెపల్లి గ్రామాల్లో తహసీల్దార్ గోవిందమ్మ మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, సిబ్బంది పర్వేజ్, సుదర్శన్, రాంచంద్రారావు, పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతకుమార్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: తహసీల్దార్ పద్మావతి సాలిండాపూర్ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. సదస్సులో 35 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు.

తాండూరు రూరల్: మల్కాపూర్, చెంగోల్ గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. తహసీల్దార్ తారాసింగ్ పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మల్కాపూర్‌లో జరిగిన సదస్సులో మూడు చెంగోల్‌లో 15 అర్జీలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లలిత, ప్రదీప్‌కుమార్, గోపి పాల్గొన్నారు.

వికారాబాద్: మైలార్ దేవరంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం(నేడు) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భూ భారతి రెవెన్యూసదస్సు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు సామల కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ బాలాజీ ఉట్ల తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం ‘ఎంగేజ్‌మెంట్ టు రిలేషన్‌షిప్ లెర్నింగ్’ అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు విషయ పరిజ్ఞానం అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. అధ్యాపకులు నిత్యవిద్యార్థులేనని గుర్తుచేశారు. విద్యార్థులపట్ల స్నేహపూర్వకంగా ఉండాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఏఎం రావు, సంపత్, వేణుగోపాల్, అరుంధతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కొడంగల్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటిపై నుంచి విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని బూల్కపూర్‌లో అంజనేయ ఆలయం సమీపంలో గల భీమప్ప ఇంటిపై నుంచి వ్యవసాయ పొలాలకు వేసిన విద్యుత్ లైన్ స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండడంతో విద్యుత్ వైర్లు ఇంటి స్లాబ్‌పై ఫీట్‌ఎత్తులో వేలాడుతున్నాయి. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను తొలగించాలని ఇంటి యజమాని భీమప్ప, అతడి భార్య వెంకటమ్మ కోరారు.



బూల్కపూర్‌లో ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కొడంగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో రాంరెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా 82మంది విద్యార్థులు 6, 8వ తరగతుల్లో చేరినట్లు తెలిపారు.

దుద్యాల: బడిమానేసిన ఇద్దరు విద్యార్థులు మంగళవారం దుద్యాల మండల కేంద్రంలో బడిబాటలో భాగంగా పాఠశాలలో చేరారు. ఇద్దరు దివ్యాంగులను 1, 8వ తరగతుల్లో చేర్పించినట్లు ఎంఈవో విజయరామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చందర్‌నాయక్, ఐఆర్‌పీ రాంశ్రీనివాస్‌బాబు పాల్గొన్నారు.

బీఎల్‌ఏలను నియమించుకోవాలి

కొడంగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకులు పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్‌ఏలను నియమించుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు తదితర వాటిపై చర్చించారు.

జస్టిస్ పున్నయ్య కమిషన్ అంశాలపై అవగాహన కల్పించాలి

తాండూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ పున్నయ్య కమిషన్‌లోని బీసీ, ఎసీ, ఎస్టీలకు సంబంధించిన అంశాలపై ఎంఆర్‌వో, ఎంఈవో, ఎస్ఐలు అవగాహన కల్పించాలని బీఎస్పీ రాష్ట్రనేత చంద్రశేఖర్ కోరారు. చెనిగేష్‌పూర్‌లో ఎరుకల శారద కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. సదస్సులు పెట్టి అవగాహన కల్పించాలని, అప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలు పరస్పరం గౌరవించుకునేలా అధికారులు చైతన్యం తీసుకురావాలని కోరారు.

డుమ్మా.. ఇక కుదరదమ్మా!

(ఐదో పేజీ తరువాయి)

ఈ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు సమాచారం. జిల్లాలో జెడ్పీ కార్యాలయంతో పాటు 20 మండల ప్రజా పరిషత్తు కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాల్లో ప్రస్తుతం ఆఫ్‌లైన్ హాజరు విధానం కొనసాగుతోంది. పనిచేసే సిబ్బంది ఉదయం కార్యాలయాలకు ఆలస్యంగా వచ్చినా.. సాయంత్రం నిర్ణీత సమయం ముగియక ముందే త్వరగా వెళ్లినా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. హాజరు రిజిస్టర్‌లో సంతకం చేస్తే చాలు రోజంతా కార్యాలయంలోనే విధులు నిర్వహించినట్లు భావిస్తున్నారు. చాలా వరకు మండల ప్రజా పరిషత్తు కార్యాలయాల్లో లేట్ రిజిష్టర్లు నిర్వహించడం లేదని తెలుస్తోంది. విధులకు ఆలస్యంగా వచ్చినా.. త్వరగా వెళ్లినా లేట్ రిజిష్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. మూడు పర్యాయాలు లేట్ రిజిస్టర్‌లో పేరు నమోదైతే ఒక సెలవు కోల్పోయినట్లు పరిగణించే విషయం తెలిసిందే.

ఇష్టారాజ్యానికి చెక్!

కిందిస్థాయి సిబ్బంది కొందరు కార్యాలయాలకు రావడం, వెళ్లడం అంతా వారి ఇష్టారాజ్యంగానే కొనసాగుతున్నట్లు గుర్తించిన ఉన్నతాధికారులు అడ్డుకట్ట వేయాలని ముఖ గుర్తింపు హాజరు విధానం అమల్లోకి తీసుకు వచ్చినట్లు చెబుతున్నారు. కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది కొందరు తమ విధుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, మారుమూల మండలాల్లో పనిచేసే వారిలో కొందరు ఏకంగా రోజుల తరబడి తమ విధులకు ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. విధులకు హాజరైనా.. హాజరు రిజిష్టర్‌లో సంతకం చేయడం, ఆ తర్వాత స్వంత పనులపై బయటకు వెళ్లడం వంటి పనులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరైతే విధులకు హాజరు కాకపోయినా ఆ తర్వాత వచ్చి రిజిస్టర్లలో సంతకాలు చేస్తున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో ఇలాంటి వాటికి చెక్ పెట్టాలని ముఖ గుర్తింపు హాజరు విధానం అమల్లోకి తీసుకు రావాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంతకు ముందు ఈ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు విధానం అమల్లోకి తీసుకు వచ్చినా అది కొద్ది రోజులకే పరిమితమైంది. కారణాలేమో గానీ అమర్చిన కొన్ని రోజులకే ఆ పరికరాలు పని చేయకుండాపోయాయి.



ఘట్‌కేసర్: సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం

ఘట్‌కేసర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధితో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుతోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆయన మంగళవారం ఘట్‌కేసర్‌కు చెందిన నాగభూషణంకు రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, దేవేందర్, ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

మర్పల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన 50మందికి మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాములుయాదవ్, మండల అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13మంది లబ్ధిదారులకు మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుభాష్‌గౌడ్, సురేందర్, వెంకట్‌రెడ్డి, మహంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోండి

తాండూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తాండూరు చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ ప్రతినిధుల బృందం మంగళవారం ఎంఈవో వెంకటయ్యను కోరింది. సాయిపూర్ ప్రాంతంలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ వారు తమ స్టాఫ్‌ను పెట్టి స్నేహ బుక్ సెంటర్ వెనుకల అక్రమంగా పుస్తకాలను విక్రయిస్తున్నారని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. లేదంటే డీఈవోకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు భాను, సాయి, మహేష్, మనోహర్, నవీన్ పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

బషీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ బషీరాబాద్ మండల ఇన్‌చార్జి బంటారం భద్రేశ్వర్ అన్నారు. మంతట్టిలో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షులు జగన్ ముదిరాజ్‌తో కలిసి ఆయన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లుగా అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు రచ్చబండ కార్యక్రమంలో క్లుప్తంగా వివరించారు. అనంతరం మట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సాధించిన విజయాలు, నిర్మాణాత్మక నిర్ణయాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్, జగదీశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఫీజులను నియంత్రించాలి

పరిగి: ప్రైవేట్ పాఠశాలలు విద్యాహక్కు చట్టం కింద పేదలకు 25శాతం సీట్లు కేటాయించాలని ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం పరిగి ఎంఈవో గోపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎరన్‌పల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యమైన విద్య, సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు..

ఘట్‌కేసర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు చేయూతనందించేందుకు ప్రతీఒక్కరు కృషిచేయాలని ట్రెయినీ పైలెట్ సోఫీ విజయం అన్నారు. ఘట్‌కేసర్‌లోని జడ్పీబాలికల పాఠశాల విద్యార్థులకు మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ‘జే17 కోలాబొరేషన్ అయిడిస్గ్ రిలేషన్‌షిప్ ట్రాన్స్‌ఫర్మేషన్’ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆమె 550మంది విద్యార్థులకు స్టీల్ గ్లాసులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు, సంస్థప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా, రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలి

పరిగి: రైతుభరోసా, పంటరుణాల మాఫీని పూర్తిస్థాయిలో అమలుచేయాలని తెలంగాణ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజావాణి ప్రత్యేక ప్రతినిధి చిన్నారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. టీకేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అందె విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. 40శాతం మందికి రైతుభరోసా, రుణమాఫీ కాలేదని, వీరందరికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● గుర్తుతెలియని మరొకరికి తీవ్ర గాయాలు



శివకుమార్ మృతదేహం



గాయాలపాలైన గుర్తు తెలియని వ్యక్తి

కొడంగల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కొడంగల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ జీవీ.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన శివకుమార్ సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని యంజీబీఎస్ బస్టాండ్ నుంచి కోస్గికి వచ్చేందుకు బస్సులు లేకపోవడంతో పరిగి వరకు బస్సులో వచ్చాడు. పరిగి నుంచి రావుల్‌పల్లి వెళ్తున్న కారు డ్రైవర్ రవికుమార్‌ను లిఫ్ట్ అడిగాడు. రవికుమార్‌తో పాటు మరో గుర్తుతెలియని వ్యక్తి కారులో ఎక్కాడు. ఈక్రమంలో కొడంగల్ పట్టణ శివారులోని దాల్ మిల్ వద్ద కొడంగల్ వైపువెళ్తున్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న శివకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కారు నడుపుతున్న రవికుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈఘటనపై మృతుడి మామ యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో 8712670046 సెల్‌నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మరొకరు..

దౌల్తాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి మృతిచెందిన ఘటన దౌల్తాబాద్ మండలంలో జరిగింది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిరుమలాపూర్ గ్రామానికి చెందిన చిన్నబాయి జైపాల్‌రెడ్డి ఈనెల 15వ తేదీన గ్రామసమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికారు. చెరువు దగ్గర నీటిలో మంగళవారం ఉదయం మృతదేహం తెలియాడుతుండటం గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. మృతుడి భార్య చిన్నబాయి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మల్లప్ప మృతదేహం

దౌల్తాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన దౌల్తాబాద్ మండలంలో జరిగింది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోకఫస్లాబాద్‌కు చెందిన గొల్ల మల్లప్ప(55) తన చెల్లెలు అనంతమ్మ తనకు తెలియకుండా 25గుంటల భూమిని పట్టాచేసుకుందని అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో సోమవారం క్షణికావేశంలో పొలం దగ్గర గుర్తుతెలియని పురుగుల మందు సేవించాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని మల్లప్పను చికిత్సనిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

ఫంక్షన్ హాల్‌లో షార్ట్‌సర్క్యూట్

● రూ.15లక్షలకు పైగా నష్టం



ఫంక్షన్‌హాల్‌లో దగ్ధమైన సామగ్రి

తాండూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణ శివారులోని వీరశైవ సమాజం ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఫంక్షన్ హాల్‌లో ఎలాంటి ఫంక్షన్లు లేకపోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. ఫంక్షన్ హాల్‌లో కుర్చీలు, కూలర్లు, డెకొరేషన్ మెటీరియల్, తదితర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. తాండూరు ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ జలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. దాదాపు రూ.15లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగిందని నిర్వాహకులు వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మోతి

పరిగి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్త్రీశిశు సంక్షేమశాఖ రీజినల్ డైరెక్టర్ మోతి, జిల్లా అధికారిణి జయసుధలు అన్నారు. అమ్మమాట-అంగన్‌వాడి బాటలో భాగంగా మంగళవారం పరిగి మున్సిపల్ పరిధిలోని బహార్‌పేట్, మండలంలోని కాళ్మాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉజ్వల, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని కొత్త కొల్కుంద, మోమిన్‌పేట్, టేకులపల్లి, మక్తతండా తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. సూపర్‌వైజర్ పుష్పలత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు గంగమ్మ, భారతమ్మ, తారాబాయి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

మర్పల్లి: అమ్మఒడి నుంచి అంగన్‌వాడీ అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానా మంగళవారం అక్షరభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పూడూరు: సోమన్‌గుర్తి అంగన్‌వాడీ కేంద్రం-1లో మంగళవారం చిన్నారులకు అక్షరభాస్యం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రమాదేవి పాల్గొన్నారు.

దుకాణ యజమానులకు నోటీసులు

కులకచర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో మంగళవారం మండల కేంద్రంలోని రోడ్డుపక్కన ఉన్న పలు దుకాణా యజమానులకు పోలీసు సిబ్బంది నోటీసులు అందించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.